నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 27 ఏప్రిల్ 2024 | HYDERABAD

అబద్ధాల ఆరు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజలు విముఖతతో ఉన్నారని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం బోడుప్పల్‌లోని లక్ష్మీనగర్ ఆక్సిజన్ పార్కులో మేయర్ బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డితో కలిసి వాకర్స్‌తో మాటా ముచ్చట కార్యక్రమాన్ని నిర్వహించారు.
-బోడుప్పల్, ఏప్రిల్ 26

సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ఆటో డ్రైవర్ వారాసిగూడకు చెందిన మహ్మద్ ఇబ్రహీం చివరి రోజు తన నామినేషన్‌ను దాఖలు చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుడికి ఎలాంటి న్యాయం చేయడం లేదని, అందుకే తాను ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు చెప్పారు. తనను ఆశీర్వదిస్తే పార్లమెంట్‌లో ప్రజల కోసం పోరాడుతానన్నారు.
-సికింద్రాబాద్, ఏప్రిల్ 26

నీకు నేను.. నాకు నువ్వు..

చేతిలో ఒదిగిన కమలం

కంటోన్మెంట్‌లో ఒక్కటైన కాంగ్రెస్, బీజేపీ
ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోవడమే వ్యూహం
బీజేపీ నుంచి వచ్చిన వ్యక్తికి కాంగ్రెస్ టికెట్
డమ్మీ అభ్యర్థిని బరిలో దింపిన కాషాయం
ప్రచారం చేయకుండా పరోక్షంగా కాంగ్రెస్‌కు సహకారం

కంటోన్మెంట్, ఏప్రిల్ 26: కంటోన్మెంట్ ఉప ఎన్నిక పోరులో కాంగ్రెస్, బీజేపీలు దోస్తీ కట్టాయి. బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోవడమే లక్ష్యంగా తమ సిద్ధాంతాలను సైతం పక్కనపెట్టి కాషాయం, హస్తం కలిసిపోయాయి. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఓడిపోయిన వ్యక్తికే.. కాంగ్రెస్ ఈ ఉప ఎన్నికలో టికెట్ కేటాయించడంతో వారి రహస్య చెలిమి బయటపడిందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పార్లమెంట్ స్థానాల్లోనూ కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ గెలుపును అడ్డుకోవడం కోసం పరిస్థితులను ఆధారంగా చేసుకుని బలహీనమైన, బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపి వ్యూహాలు పన్నుతున్నాయి. ఇదంతా సీఎం రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డిల వ్యూహమంటూ.. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన శ్రీగణేశ్‌ను కాంగ్రెస్.. పార్టీలో చేర్చుకున్నది. ఉప ఎన్నికలో తమ అభ్యర్థిగా బరిలో నిలబెట్టింది.

డమ్మీ అభ్యర్థిని బరిలోకి దింపి..

బీజేపీ నుంచి వెళ్లిన శ్రీగణేశ్‌ను బాగా వ్యతిరేకించిన స్థానిక బీజేపీ కంటోన్మెంట్ నేతలు ఎట్టకేలకు ఎన్నికల్లో ఓడించాలని శపథం చేశారు. దీంతో పాటు బీజేపీ నుంచి గట్టి వ్యక్తిని పోటీలో నిలిపి.. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్‌కు చుక్కలు చూపించాలని నిర్ణయించారు. కానీ పార్టీ ఆదేశాలతో వారు అనుకున్న వ్యక్తికి కాకుండా నియోజకవర్గంతో సంబంధం లేని ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఓ డమ్మీ అభ్యర్థిని బరిలోకి దించడంతో కాషాయ నేతలు కంగుతిన్నారు. బీజేపీ అధిష్టానం కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందంతో కంటోన్మెంట్ సీటు కాంగ్రెస్‌కు, మల్కాజిగిరి పార్లమెంట్ సీటు బీజేపీకి అంటూ.. పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు కాంగ్రెస్‌కు బీజేపీ సహకరించాలని, మల్కాజిగిరి పార్లమెంట్ సీటులో కాంగ్రెస్ పార్టీ బీజేపీకి సహకరించేలా రహస్య మంతనాలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే తరుణంలో బీజేపీ ఎవరికీ పరిచయం లేని ఓ డమ్మీ అభ్యర్థిని కంటోన్మెంట్ బరిలో దింపడం పార్టీ శ్రేణులకు నచ్చకపోవడంతో అంతర్గతంగా వాళ్లంతా కమలం పెద్దలపై గుర్రుగా ఉన్నట్టు తెలిసింది.

ప్రచారం చేయకుండా..

బీఆర్ఎస్ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కంటోన్మెంట్‌లో బీజేపీ అభ్యర్థిగా వంశా తిలక్‌ను పోటీలో ఉంచడంతోనే వారి రహస్య ఒప్పందం బట్టబయలైంది. మరోవైపు టికెట్ ప్రకటించిన నాటి నుంచి కనీసం ప్రచారం కూడా బీజేపీ అభ్యర్థి చేపట్టకపోవడంతో మరింత అనుమానాలకు తావిస్తోంది. కేవలం కంటోన్మెంట్ ఐదో వార్డులో ఇటీవల మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ రోడ్ షోలో మాత్రమే కనిపించిన వంశా తిలక్ మళ్లీ.. గురువారం నామినేషన్ దాఖలు చేసిన సమయంలోనే కనిపించడం విశేషం. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ అనుకూల పవనాలు వీస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు బీజేపీతో ఒప్పందం చేసుకుని బీఆర్ఎస్‌ను ఓడించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కానీ కంటోన్మెంట్ వాసులు కాంగ్రెస్, బీజేపీల జిమ్మిక్కులను ముందే గ్రహించి గులాబీ జెండానే కంటోన్మెంట్ గడ్డపై ఎగురవేస్తామని స్పష్టం చేస్తున్నారు.

తెల్లాపూర్ హుడా కాలనీ నుంచి ఓఆర్ఆర్ ఈదుల నాగులపల్లి వరకు నిర్మించిన రోడ్డు

ఇటీక కనెక్టివిటీ!

శివార్లలో తీరుతున్న ట్రాఫిక్ చిక్కులు
కేసీఆర్ ప్రభుత్వం ముందు చూపుతోనే ఐటీ కారిడార్‌లో మెరుగైన రోడ్ నెట్ వర్క్
తెల్లాపూర్ నుంచి ఈదులనాగులపల్లి
తెల్లాపూర్ - శంకర్‌పల్లి వరకు లింకు రోడ్ల నిర్మాణం

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా అత్యంత మెరుగైన రోడ్డు నెట్ వర్క్‌ను నిర్మించడమే లక్ష్యంగా చేసుకొని హెచ్ఎండీఏ శివారు ప్రాంతాల్లో కొత్త రోడ్లు నిర్మిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం మహానగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చిన 33 రేడియల్ రోడ్లతో పాటు వాటికి అనుసంధానంగా లింకు రోడ్ల నిర్మాణం చేపట్టింది. కొత్తగా లింకు రోడ్ల నిర్మాణంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో పట్టణీకరణ మరింత వేగవంతమైంది. ఇప్పటి వరకు 137కు పైగా లింకు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టగా, వీటిలో ఐటీ కారిడార్ పరిధిలోనే ఎక్కువగా త్వరితగతిన పూర్తయ్యాయి.

నిర్మాణం పూర్తయిన రెండు రోడ్లు..

ఐటీ కారిడార్‌లోని తెల్లాపూర్ నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్డు నంబరు 7ను నిర్మించాలని ప్రతిపాదించారు. కేసీఆర్ ప్రభుత్వం రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్ పేరుతో తెల్లాపూర్ హుడా కాలనీ నుంచి ఓఆర్ఆర్ ఈదుల నాగులపల్లి మీదుగా మోకిల-కొండకల్ రోడ్డు వరకు రోడ్డును నిర్మించింది. గచ్చిబౌలి హెచ్‌సీయూ నుంచి గోపన్‌పల్లి మీదుగా వట్టినాగుల పల్లి వరకు మరో రహదారి నిర్మాణం చేపట్టింది. ఐటీ కారిడార్‌ను ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో నివాస ప్రాంతాలు పెద్ద మొత్తంలో విస్తరిస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ సైతం గణనీయంగా పెరుగుతున్నది. దీంతో మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రహదారుల నిర్మాణంతో పాటు ఇప్పటికే చేపట్టిన రేడియల్ రోడ్ల నిర్మాణాలను మరింత ముందుకు పొడిగించేలా హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. రేడియల్ రోడ్డు 30కి పొడిగింపుగా కొత్తగా నల్లగండ్ల హుడా కాలనీలోని రేడియల్ రోడ్డు 7తో అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టింది. అవసరం ఎక్కడ ఉందో గుర్తించి, అక్కడ క్షేత్ర స్థాయిలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏతో పాటు స్థానిక మున్సిపాలిటీ అధికారులతో కలిసి లింకు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోనే భారీ ఎత్తున గేటెడ్ కమ్యూనిటీ, హైరైజ్ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా మెరుగైన రోడ్ నెట్ వర్క్‌ను కల్పించేందుకు అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా లింకు రోడ్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా చేపట్టిన రెండు రేడియల్ రోడ్డు, వాటికి అనుసంధానంగా లింకు రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇవి అందుబాటులోకి వస్తే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఇక్కట్లకు చోటు ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.లింకు రోడ్ల ద్వారా ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు భారీగా ఊరట కలగడంతో పాటు సమయం, ఇంధనం సైతం ఆదా అవుతుందంటున్నారు.

తెల్లాపూర్ నుంచి శంకర్‌పల్లి వరకు....

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో నిజాంపేట, కొంపల్లి, దుండిగల్, అమీన్‌పూర్‌తో పాటు ఐటీ కారిడార్ వైపు ఉన్న తెల్లాపూర్, నార్సింగి, మణికొండలు ఉన్నాయి. తెల్లాపూర్ నుంచి శంకర్‌పల్లి వరకు ఒక లింకు రోడ్డును నిర్మించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెల్లాపూర్ నుంచి ఈదులనాగులపల్లి వరకు రహదారిని నిర్మించారు. అక్కడి నుంచి మోకిల్, కొండకల్ ప్రాంతాలను కలుపుతూ శంకర్‌పల్లి వరకు రోడ్డును నిర్మిస్తున్నారు. ఇలా శివారు ప్రాంతాల్లో ఔటర్ రింగు రోడ్డు లోపలి వైపు, బయట వైపు ఉన్న ప్రాంతాలను కలుపుతూ.. కొత్త రోడ్లను నిర్మించడంతో మెరుగైన రోడ్డు నెట్ వర్క్ ఐటీ కారిడార్ వైపు అందుబాటులోకి వస్తోంది.

'సికింద్రాబాద్'కు సమన్వయకర్తలు

నియోజకవర్గ, డివిజన్ల వారీగా సీనియర్ నేతలకు బాధ్యతలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ లోకసభ స్థానానికి సంబంధించి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గ సమన్వయకర్తలను నియమించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి పార్టీ సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్లా సోహెల్, సికింద్రాబాద్‌కు మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, అంబర్‌పేటకు సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్, సనత్‌నగర్‌కు పార్టీ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ముషీరాబాద్‌కు మాజీ ఎమ్మెల్సీ సలీం, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, నాంపల్లికి ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, ప్రభాకర్ రావు, ఖైరతాబాద్‌కు సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌లను నియమించారు. ఆయా డివిజన్లకు సమన్వయకర్తలుగా నియమించగా.. వెంకటేశ్వర కాలనీకి కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఖైరతాబాద్‌కు పార్టీ సీనియర్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి, జూబ్లీహిల్స్‌కు కార్పొరేటర్ వెంకటేశ్, బంజారాహిల్స్‌కు మాజీ చైర్మన్ విప్లవ్‌కుమార్, హిమాయత్‌నగర్‌కు హేమలత, సోమాజిగూడకు పార్టీ సీనియర్ నాయకులు ఆశిష్ యాదవ్‌లను నియమిస్తూ కేటీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో అందరిని సమన్వయం చేసుకుంటూ, సరికొత్త ప్రణాళికలతో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా సమన్వయకర్తలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

ఎల్లీబర్డ్‌కు స్పందన అంతంతే

సిటీబ్యూరో: ఎల్లీబర్డ్ పథకంపై పార్లమెంట్ ఎన్నికల ప్రభావం పడుతోంది. ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లిస్తూ 5 శాతం రాయితీ పొందాలన్న జీహెచ్ఎంసీ పిలుపునకు వినియోగదారులు నామమాత్రంగానే స్పందించారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు జీహెచ్ఎంసీ 'ఎల్లీబర్డ్' స్కీంను ప్రవేశపెట్టింది. 30 సర్కిళ్ల పరిధిలో రూ. 800 కోట్ల మేర వసూళ్లను రాబట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. అయితే గడిచిన 26 రోజుల వ్యవధిలో కేవలం రూ. 550 కోట్ల మేర మాత్రమే ఆదాయం వచ్చింది. 5.50 లక్షల మంది వినియోగదారులు ఈ ఎల్లీబర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరో 5 రోజుల్లో లక్ష్యాన్ని చేరడం కష్టసాధ్యంగానే మారింది. ఇందుకు కారణాలు కమిషనర్ మొదలు ఉన్నతాధికారుల వరకు పార్లమెంట్ ఎన్నికల విధుల్లో ఉండటం.. క్షేత్రస్థాయిలో ఉండే అధికారులపై పర్యవేక్షణ లేకపోవడం..ఎల్లీబర్డ్ స్కీంపై ప్రజలకు అవగాహన కల్పించకపోవమే అని అంటున్నారు. ముఖ్యంగా రూ. కోట్లలో ఆస్తిపన్ను బకాయి ఉన్న వారికి తరచూ ఎల్లీబర్డ్ స్కీం సద్వినియోగంపై ఎస్ఎంఎస్‌లు చేర్చేవారు. కానీ ఈ సారి అవగాహన కల్పనలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని జోన్ల కంటే ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ల నుంచి ఎల్లీబర్డ్‌కు ఆశించిన స్పందన రాలేదని సమాచారం. కాగా, ఎల్లీబర్డ్ పథకానికి మిగిలింది ఐదు రోజులేనని కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు.

ఏరోస్పేస్‌లో ఆవిష్కరణలు ప్రోత్సహించేలా..

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): ఏరోస్పేస్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీ హబ్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఏరోస్పేస్ రంగంలో ఎంతో అనుభవమున్న కొలిన్స్ ఏరోస్పేస్ కంపెనీతో జత కట్టింది. టీహబ్ వేదికగా ఇప్పటికే స్కైరూట్ స్పేస్, ధ్రువ ఏరోస్పేస్ వంటి స్టార్టప్ కంపెనీలు ఎంతో విజయవంతంగా ఆ రంగంలో తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. ఏరోస్పేస్ రంగంలో మరిన్ని ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఔత్సాహికుల స్టార్టప్ వ్యవస్థాపకుల కోసం టీహబ్‌లో వేదికగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డైనమిక్ ట్రావెల్ టైమ్, డిజిటల్ ప్రొడక్ట్ పాస్‌పోర్టు, రియల్ టైమ్ వెదర్ డేటా ఫ్యూజన్, మెటా సర్ఫేస్ డిస్‌ప్లే వంటి అంశాల్లో ఆవిష్కరణలు చేసే వారికి ప్రోత్సాహం అందించనున్నారు. ఔత్సాహికులు లింకు (https://bit.ly/49KhwiB)లో సంప్రదించాలని, మే 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.



తరగతి గదుల్లో ఏఐ

'ఇంగ్లిష్ జ్ఞానీ' పేరుతో యాప్

సిటీబ్యూరో, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) పరిజ్ఞాన్ని అన్ని రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తున్నారు. సరికొత్త అప్లికేషన్లు రూపొందిస్తూ అన్ని రకాల కార్యకలాపాలకు ఏఐ తప్పనిసరి అన్నట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఏఐ కేంద్ర బిందువుగా మారింది. దాన్ని కేంద్రంగా చేసుకునే రకరకాల అప్లికేషన్లు, టూల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా, గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీలోని పరిశోధక బృందం కొత్తగా తరగతి గదుల్లో ఆంగ్ల భాషలో సమర్థవంతమైన విద్యాబోధనకు అవసరమైన యాప్‌ను రూపొందించింది. 'ఇంగ్లిష్ జ్ఞానీ' పేరుతో రూపొందించిన ఈ వెబ్ అప్లికేషన్‌ను ప్రాథమికంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగాత్మకంగా పరిశీలించామని అప్లికేషన్ రూపకర్తలో ఒకరైన ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థ సీనియర్ రీసెర్చ్ సైంటిస్టు అర్జున్ రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు ఆంగ్లంలో నేర్చుకునే వనరులు చాలా తక్కువగా ఉన్నాయి. దీన్ని అధిగమించేందుకు రాజ్ రెడ్డి సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ సొసైటీ (ఆర్‌సీటీఎస్)లోని పరిశోధకులు ఇంగ్లిష్ మాట్లడం, చదివేందుకు సమర్థవంతంగా ఉపయోగపడేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో పనిచేసే 'ఇంగ్లిష్ జ్ఞానీ' పేరుతో ఒక టూల్‌ను రూపొందించామన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ వెబ్ అప్లికేషన్‌ను మరోసారి ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఉపాధ్యాయులతో ఉపయోగించి, వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని తుది అప్లికేషన్‌ను దేశ వ్యాప్తంగా ఇంగ్లిష్ భాషా బోధనలో వినియోగించేలా ఈ పరిశోధన కొనసాగుతుందని అర్జున్ రాజశేఖర్ వివరించారు.

వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

మీ బిడ్డను.. ఆశీర్వదించండి

కంటోన్మెంట్, ఏప్రిల్ 26: 'మీ బిడ్డగా.. మీ ముందుకు వస్తున్న.. ఆశీర్వదించండి' అంటూ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఓటర్లను కోరారు. శుక్రవారం ఆమె ఒకటో వార్డు పరిధిలోని సెవన్ టెంపుల్, చిట్టిరెడ్డి కాలనీ, చిన్నతోకట్ట, నక్కలపల్లి బస్తీల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమవుతూ.. ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ఆ పార్టీ మోసం చేసిందని, ఆ పార్టీ మాటలు వింటే మరోసారి గోసపడుతామని చెప్పారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ గెలిస్తేనే అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు.

వీధివీధినా..బ్రహ్మరథమే

సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు మంగళహారతులు ఇస్తున్న మహిళలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 26: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏ నియోజకవర్గానికి వెళ్లినా... ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మెట్టుగూడ డివిజన్‌లో శుక్రవారం పద్మారావుగౌడ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కారు గుర్తుకే ఓటేస్తామని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చెబుతున్నారని ఆయన అన్నారు. సికింద్రాబాద్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

నేడు కేటీఆర్ రోడ్ షో..

జూబ్లీహిల్స్: సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు మద్దతుగా శనివారం ఎర్రగడ్డ డివిజన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో సల్మాన్ హోటల్, గోకుల్ సినిమా హాల్ వద్ద రోడ్‌షో ప్రారంభమవుతుందన్నారు.

ఉచిత హామీలతో మభ్యపెట్టిన కాంగ్రెస్

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, ఏప్రిల్ 26: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం విలేజ్, మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రాబోస్ నగర్ కాలనీలో పాదయాత్ర చేసి.. కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. చేవెళ్ల గడ్డపై కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించి.. కేసీఆర్‌కు కానుకగా అందిద్దామన్నారు. హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజలను ఉచిత హామీలతో మభ్యపెట్టే ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తూ వస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు.

కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి మద్దతుగా శంషాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

కాంగ్రెస్ పాలనలో తాగునీటి కష్టాలు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 26 : చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం శ్రేణులు సైనికుల్లా పని చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి, మల్కారం, నానాజీపూర్ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే తన నివాసంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీగా జ్ఞానేశ్వర్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. పదేండ్లలో సీఎంగా కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులు దాటినా.. ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా.. సాగు, తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నట్లు చెప్పారు. చేవెళ్ల ఎంపీగా కాసానిని గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నీరటి రాజు ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, కల్పనా సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.